# 7

# మౌన ప్రవాహం

క్రిష్ణవేణి వస్తోంది రేపు. ఈ తలంపే ఎక్కడలేని బలమూ వచ్చినట్టుంది శ్రీనాథ్‌కి. లేచి... కాస్తో కూస్తో ఇల్లు సర్దడం మొదలుపెట్టాడు.

మరీ ఎక్కువ సామానేం లేదు ఇంట్లో. కానీ అన్నీ దుమ్ము పేరుకుపోయి ఉన్నాయి.

మనసే మసకబారిపోయినప్పుడు... ఇంట్లో వస్తువులమీద చేరిన దుమ్ము పట్టించుకునే స్థితిలో లేడు ఇన్ని రోజులుగా.

'అసలిది ఇల్లు కాదు. నన్ను నేనే బంధించుకున్న ఒక పంజరం' అనుకుంటూ ఉంటాడు ఒక్కొక్కరోజు.

అమ్మ పోయినప్పటినుంచీ ఎలా ఉంటున్నాడో, ఎలా కాలం గడుపుతున్నాడో, ఏం వండుకుంటున్నాడో, ఏం తింటున్నాడో తనకే తెలియదు. దగ్గరి బంధువులంటూ లేరు. మిత్రవర్గం కూడా పెద్దది కాదు. ఎప్పుడైనా ఒకరో ఇద్దరో వచ్చి పలుకరించి పోతారు. కొద్దో గొప్పో కాస్త చనువుగా వుండే నలుగురు స్నేహితులూ దూరప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

చదువైపోగానే తనూ ఉద్యోగంలో చేరిపోయాడు ఉన్న ఊళ్ళోనే. ఆఫీసులోనూ స్నేహితులు దగ్గరైన వారు లేరు.

మానసిక శాంతి కోల్పోయిన తానే ఎవరికీ దగ్గర కాలేకపోయాడేమో?...

ఔను... ఇదే నిజం.

ముందు గదిలో ఇష్టం వచ్చినట్టు పడేసిన దినపత్రికలు అన్నీ తీసి కట్టకట్టి వెనకవైపు కటకటాల వరండాలో గోడవారగా పెట్టేసి వచ్చాడు.

కిటికీలోనూ... టీవీ బల్లమీదా పడేసిన బట్టలూ... టీ పాయ్ మీద నుంచి పాముల్లా వేలాడుతున్న రెండు తోలుబెల్టులూ, టీపాయ్ కింద చెల్లాచెదురుగా పడున్న పెన్నులూ, టార్చిలైటూ, ఫోటో ఆల్బమ్ అన్నీ తీసి బాగా దులిపి వేటి స్థానంలో వాటిని సర్దిపెట్టాడు.

వంటిల్లు చక్కదిద్దే ప్రయత్నంగా అటు నడిచాడు.

రోజూ ఈ వంటింట్లోనే కదా... ఏదో ఒకటి చేతికొచ్చినదేదో వండుకుంటున్నాడు, తింటున్నాడు కదా! ఇవాళెందుకూ ఇంత భయంకరంగా ఇంత రోతగా కనిపిస్తోంది వంటిల్లు.

స్టవ్‌మీద ఎండిపోయిన పాలూ కాఫీల మరకలు... చుట్టూ గట్టుమీద వండిన వంటల గుర్తులు... ఇష్టమొచ్చినట్టు పడేసిన పోపు సామాన్ల డబ్బాలూ... గరిటలూ చెంచాలూ... రణరంగంలా ఉందని అనుకోవడంలో తప్పులేదేమో!

అప్పుడు గుర్తొచ్చింది హఠాత్తుగా... పని మనిషెందుకు రావట్లేదు ఈ మధ్య?

చెప్పా చెయ్యకుండా పూర్తిగా మానేసినట్టుందే? పొద్దున్న ఏడున్నరకి ముందే ఇంట్లోంచి బయటపడితే రాత్రవుతోంది తాను ఇంటికి చేరేసరికి. టైమింగ్సు కుదరక ఇంకో ఇల్లు పట్టుకుందేమో ఇక్కడ మానేసి? ఏది ఏమైనా... మనసు ఎంత అశ్శాంతికి లోనైనా ఇల్లు శుభ్రం చేసుకోవడం తప్పదుగా!

అలా అనుకుంటూనే గబగబా వంటగదిని ఓ కొలిక్కి తెచ్చే ప్రయత్నంలో పడ్డాడు.

ఊహ తెలియని రోజుల్లోనే నాన్నపోయాడు. కన్నీళ్ళంటే ఏమిటో తెలియదు అప్పుడు. అమ్మా నాన్నా తానే అయి కళ్ళల్లో పెట్టుకుని పెంచి పెద్దచేసిన అమ్మ నెల్లాళ్ళ కిందట కన్నుమూసినప్పుడు విలువైన కన్నీళ్ళు కారాయి తన కళ్ళనుంచి.

ఔను... తల్లి విలువ ఆ కన్నీటికి తెలుసు. కార్చిన గుండెలోతులకి తెలుసు. నీ కోసమే బతుకుతున్నానురా అనేది.

ఎక్కువ కాలం బతికెయ్యాలన్న కోరిక లేదు. నీకొక తోడంటూ ఏర్పడ్డాక నాకు ఏమైపోయినా ఫర్వాలేదు అనేది.

ఆవిడ మాటలకి తను అడ్డుపడేవాడు "నీకు ఏమీ కాదు. అలాంటి మాటలు అనకు".

ఏ మాటలూ అనలేనంత దూరం వెళ్ళిపోయింది హఠాత్తుగా.

తనకంటూ ఉన్న పెన్నిధి... ఉన్న ఒకే ఒక్క దిక్కు... కన్నతల్లి వెళ్ళిపోయింది ఆయుష్షు తీరి.

చేరువకాబోయిన క్రిష్ణవేణి? తప్పుకున్నదా మౌనంగా?

అందుకు తప్పిదం ఎవరిది?

నీదే నీదే తప్పు అంటూ హృదయం ఘోషించినా ఒప్పుకోలేదప్పుడు చంచల మనస్సు. అహంకారానికి పెట్టపీట వేసిన మనసు. ముందు వెనుకలు ఆలోచించటం ముసలితనమని కొట్టిపడేసిన పెంకితనం కలగలిసి... తనే ఆమెకి దూరమవలేదా?

మంచీ చెడూ ఆలోచించే ఆమె విచక్షణా జ్ఞానానికి అహంకారం అన్న రంగుపులిమి తనే ఆమెకి దూరం కాలేదా?

ఒక్కసారిగా నీరసం నిస్సత్తువ ఆవహించినట్లయి ముందు గదిలోకి వచ్చి సోఫాలో వెనక్కి వాలి కూచున్నాడు. మూసుకున్న కనురెప్పల మాటున గతం కదలాడింది.

✧ ✧ ✧

"సినిమా కెళ్దామా?"

"పెళ్ళికాకముందే సినిమాలకీ షికార్లకీ తిరిగితే తప్ప మనకి ఒకరిమీద ఒకరికి ఇష్టం ఉన్నట్టు కాదా?" చిరునవ్వుతో ప్రశ్నకి ప్రశ్నే సమాధానంగా అంది క్రిష్ణవేణి.

"అబ్బా... ముసలమ్మ కబుర్లు చెప్పకు" విసుగుతో పాటు నిర్లక్ష్య ధోరణి ధ్వనించింది మాటలో.

"నా మాటలకి నువ్వు పేరేం పెట్టుకున్నా ఫర్వాలేదు. కానీ... ఇవి నా మనసులోంచి వచ్చిన మాటలు".

"ఎలాగో మనిద్దరం పెళ్ళి చేసుకోవాలనే అనుకుంటున్నాం కదా! సినిమాలకీ షికార్లకీ తిరిగితే తప్పేమిటి?"

"ఇంకా మీ ఇంట్లోనూ మా ఇంట్లోనూ చెప్పలేదు ఈ సంగతి. పరీక్షలయ్యాక చెప్పాలని... అప్పుడు పెళ్ళి చేసుకోవాలనీ కూడా అనుకున్నాం. పరీక్షలకి ఇంకా ఆర్నెల్లు టైముంది. ముందు చదువుమీద దృష్టి పెట్టు శ్రీనాథ్. ఆర్నెల్లు ఓపిక పట్టలేని వాడివి ముందు ముందు జీవితంలో ఒడిదుడుకుల్లో సహనం ఎలా చూపించగలవు? పెళ్ళయ్యాక నీతో కలిసి ఎక్కడికి రమ్మన్నా వస్తానుగా".

"గొప్ప పని చేస్తావులే..." శ్రీనాథ్ చెవుల్లో స్నేహితులు కరుణాకర్, శీనూల మాటలు గింగురుమంటున్నాయి. "మీదేం ప్రేమరా? నీతో చక్కర్లు కొట్టడానికి రానంటుంది. నువ్వా చేతకానివాడిలా ఒప్పించలేకపోతున్నావు. ఆ భాస్కర్‌గాడిని చూడు. నీ తర్వాతే కదా వాడు ప్రేమలో పడ్డాడు. పదినరోజు నుంచీ ప్రతిరోజూ ఎలా తిరుగుతున్నాడో ఆ అమ్మాయితో తెలుసా?"

రెచ్చగొట్టే స్నేహితుల మాటలతో వారి దృష్టిలో తాను చులకనైపోతున్నట్టుగా చిన్నతనంగా అనిపిస్తోంది రోజు రోజుకీ.

క్రిష్ణవేణి ఉద్దేశ్యంలో ప్రేమంటే మనసులో పుట్టే వికారం కాదు.

ప్రేమంటే మృదుమధురమైన సంగీతంలా తోచాలి మనసుకి.

ప్రేమంటే కన్నుల కింపైన రమణీయమైన ప్రకృతి దృశ్యంలా ఆకట్టుకోవాలి హృదయాన్ని.

శ్రీనాథ్‌ని పెళ్ళిచేసుకోవాలన్న నిర్ణయం తీసుకున్న రోజునుంచీ ఆమె మనసులో మధురోహాలు సుమధురగీతమై సాగిపోతూనే ఉన్నాయి.

హృదయపు కేన్వాస్ మీద అందమైన దృశ్యాలు రూపుదిద్దుకుంటూనే ఉన్నాయి.

✧ ✧ ✧

తాడో పేడో తేల్చుకోవాలన్నట్టుగా ఓ రోజు హఠాత్తుగా అన్నాడు శ్రీనాథ్-

"ప్రేమంటే ఏమిటి?"

"రెండు మనసుల్ని ఒకటి చేసే బంధం. ఇతరులకి ప్రదర్శన చేసేది కాదు".

రాబోతున్న కోపాన్ని అదిమిపెట్టాడు.

"నా మీద నీకు నమ్మకం లేకే ఒంటరిగా ఎక్కడికీ నాతో తిరగడానికి రానంటావు" తిరుగులేని అస్త్రం ఉపయోగించాననుకున్నాడు.

"నీ మీద నమ్మకం ఉంది కాబట్టే మనస్ఫూర్తిగా నిన్ను ప్రేమిచాను". ఉన్నమాటే చెప్పింది. అందులో అబద్ధం ఏ మాత్రం లేదు. చదువుతోపాటూ సంస్కారం కూడా ఉన్న మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన క్రిష్ణవేణి ప్రేమపెళ్ళికి వ్యతిరేకి కాదు. కానీ... హద్దుల్లో ఉండాలనే నియమాన్ని గౌరవిస్తుంది. అది ఎదుటివారికి ముసలమ్మ కబుర్లలా అనిపిస్తుందేమోనని సిగ్గుపడదు, భయపడదు. ఎందుకంటే ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని నమ్ముతుంది కాబట్టి.

"తిరకాసు కబుర్లు చెప్పకు. నన్ను నిజంగా ప్రేమించిన దానివైతే ఒంటరిగా నాతో తిరగడానికి ఎందుకు రావు?" చివుక్కుమనేలా చూశాడు.

అతను కూడా మనస్ఫూర్తిగానే ఆమెని ప్రేమిస్తున్నాడు. కానీ ఈ చిరాకెందుకు? ఈ అసహనం ఎందుకు? చుట్టూ వున్న వాతావరణ ప్రభావమా?

అతని ప్రశ్నకి ఆమె కొద్దిగా నొచ్చుకున్న మాట నిజం.

"నీ మీద నాకు నమ్మకం లేదా అని కదా అడిగావు? ఇప్పుడు నాకు ఏమనిపిస్తోందో తెల్సా? నిజానికి నామీదే నీకు నమ్మకం లేదేమోనని".

"అలా ఎందుకనుకుంటున్నావు?" విసురుగా వచ్చింది ప్రశ్న.

"ఔను మరి. ఒంటరిగా ఇక్కడికీ అక్కడికీ తిరగడానికి నేను రానంటున్నాను కాబట్టి... నా ప్రేమ మీద నీకు అపనమ్మకం కలిగింది కదా?"

ఖంగు తిన్నాడు శ్రీనాథ్. నిజమేనా? స్నేహితుల మాటలవల్ల తన మనసులో ఏ మూలనో అనుమానం చోటు చేసుకున్నదా? అందుకే తను ఇంతగా అసహనానికి గురి అవుతున్నాడా? లేదు. ఆమె పంతమే తనకి నచ్చట్లేదు.

"చూడు శ్రీనాథ్. పరీక్షలయ్యాక నిన్ను మా ఇంటికి పిలుస్తాను. అమ్మకీ నాన్నగారికీ పరిచయం చేస్తాను. నన్ను మీ ఇంటికి తీసుకెళ్ళి మీ అమ్మగారికి పరిచయం చేద్దువుగాని, ముందు చదువుమీద దృష్టిపెడదాం".

మాట్లాడలేదు శ్రీనాథ్. తన పంతమే నెగ్గాలని తను చెప్పినట్టే చెయ్యాలని కోరుకుంటోందా?

ఎవరి వాదన వారికి సముచితంగానే తోస్తోంది. ఆమెది ఆడపెత్తనంగానూ... బి.సి.నాటి మాటల్లాగానూ అతనికి అనిపిస్తున్నాయి. అతనిది అర్థం లేని వితండ వాదంలా ఆమెకి అనిపిస్తోంది. మౌనానికి భాష్యంలా ఉండిపోయారిద్దరూ. మనసులు మాత్రం కల్లోల సాగరాలే. మర్నాడు ఒకరినొకరు పలుకరించుకునేందుకు ఇద్దర్లో ఎవరూ చొరవ చెయ్యలేదు. అంతే... అది మొదలు మెల్లి మెల్లిగా తప్పించుకు తిరగడమే తప్ప ఎదుటపడి మాట్లాడటం మానేశాడు శ్రీనాథ్. కోపాన్ని ప్రదర్శిస్తున్నాడని అర్థమయింది క్రిష్ణవేణికి. నవ్వుకుని ఊరుకుంది. పోన్లే పరీక్షలకి బాగా చదువుతాడని సంతోషించింది. ఆఖరి పేపర్ అయిపోయాక పలుకరించింది. "బాగా రాశావా?"

తల ఊపాడే తప్ప మాట్లాడలేదు.

"మా ఇంటికి స్వాగతం పలుకుతున్నాను".

చేతి వాచీ చూసుకున్నాడు. "చాలా అర్జంటు పనుంది వెళ్ళాలి".

అతని మొహంలో ఏ భావమూ అంతుచిక్కలేదామెకి.

పోనీ... ఫలానా రోజున వస్తానన్న మాట కూడా అనలేదు.

ఏదో అర్జంటు పని అన్నాడుగా... ఆ విషయమై ఆలోచనలో ఉన్నాడేమో! సర్దిచెప్పుకుంది తనకి తానే.

ఒకరోజు కాదు, రెండురోజులు కాదు నెల్లాళ్ళయినా మనిషి జాడలేదు సరికదా కనీసం ఫోన్ కూడా చెయ్యలేదు. చూసి చూసి తనే ఒకరోజు అతని సెల్‌కి చేస్తే ఆఫ్ చేసేశాడు. మాట్లాడలేదు. వరసగా నాలుగు రోజులు ప్రయత్నించింది.

లాభం లేకపోయింది. తన నెంబరు చూసి ఆఫ్ చేస్తున్నాడు. ఎందుకంత కోపం?

తనేం తప్పు చేసిందని? ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టింది.

"ఈ చదువు చాలు. పెళ్ళి చేసేస్తాం. పెళ్ళి సంబంధాలొస్తున్నాయి" అమ్మానాన్నల ఒత్తిడి.

"నా కోసం సంబంధాలు చూడద్దు. నేను చేసుకోను. పద్మకి చేసెయ్యండి".

"అదేమిటే? ముందు నీకు చెయ్యకుండా చెల్లెలికి చెయ్యమంటావు?"

"అమ్మా! నేను పెళ్ళి చేసుకుంటానో చేసుకోనో చెప్పలేను. నా మూలంగా దానికి ఆలస్యం అవడం నా కిష్టం లేదు. నాకంటే ఒక్క సంవత్సరమేగా చిన్నది" స్థిరంగా చెప్పేసింది. మరుసటి సంవత్సరమే పద్మ పెళ్ళి జరిగిపోయింది అత్తకొడుకుతో.

✧ ✧ ✧

ఉద్యోగానికి వెళ్తోంది వస్తోంది క్రిష్ణవేణి. రెండు సంవత్సరాలు రెండు యుగాల్లా గడిచాయి.

ఉద్యోగానికి వెళ్తున్నాడు వస్తున్నాడు శ్రీనాథ్. రెండు సంవత్సరాలు అసహనంతో చిరాకు పరాకులతో గడిచాయి.

తల్లి పెళ్ళిమాట ఎత్తినప్పుడల్లా అక్కడినించి లేచి వెళ్ళిపోతాడు.

"నీ మనసులో ఎవరైనా వుంటే చెప్పరా. నాకేమీ అభ్యంతరం లేదు" అంటుందావిడ వెనకనుంచి. దానికీ సమాధానం రాదు.

అహంకారానికి పెద్దపీట వేసి... గజిబిజి మనసుతో... ఒక రకమైన నిర్లిప్తతకి ప్రతిరూపమయ్యాడు. ఒకవైపు క్రిష్ణవేణిని మరిచిపోలేకపోతున్నాడు. మరోవైపు తన కోపాన్నీ అహంకారాన్నీ మట్టుబెట్టి ఆమెని కలిసే ప్రయత్నం చెయ్యలేకపోతున్నాడు. పరస్పర విరుద్ధమైన మానసిక సంఘర్షణ మనిషిని క్రుంగదీస్తుందన్నది నిజం. ఆ నిజానికి నిలువెత్తు నిదర్శనమయ్యాడు శ్రీనాథ్. రోజులు భారంగా గడిచిపోతున్నాయి.

✧ ✧ ✧

చలికాలం మూలంగా తొందరగా చీకట్లు కమ్ముకున్నాయి.

ఆఫీస్‌నుంచి ఇంటికి బయల్దేరిన క్రిష్ణవేణి పదిహేను నిముషాలుగా బస్ కోసం ఎదురు చూస్తోంది. ఎప్పుడింటికెళ్ళి పడదామా అని ఉంది.

ఆఫీస్‌లో పనెక్కువై అలిసిపోయిన రోజు బస్సు దొరకడం కూడా ఆలస్యం అవుతుంది. అదేం శాపమో అనిపించింది.

"హాయ్!" ఎవరిదో పలుకరింపుతో పక్కకి తిరిగింది.

"విమలా... నువ్వా?"

"నేనే ఏం?... అంత ఆశ్చర్యపోతున్నావు?"

కాలేజ్‌లో తనకి ఒక సంవత్సరం సీనియర్ అయిన విమలని ఈ మధ్యకాలంలో మళ్ళీ ఎప్పుడూ చూడలేదు క్రిష్ణవేణి. అందుకే ఎక్సైట్‌మెంట్ ధ్వనించింది ఆమె గొంతులో. పక్కవీధిలో బంధువులింటికి వచ్చి వెళ్తున్నానని చెప్పింది విమల. ఔనుగానీ క్రిష్ణవేణీ నీకిది తెల్సా? తెలిసే ఉంటుందిలే అంటూ విమల చెప్పిన వార్త విని కాళ్ళూ చేతులూ దడదడలాడినట్టయింది ఆమెకి. వెంటనే నోట్లోంచి మాట రాలేదు. విమల చేతిని గట్టిగా పట్టుకుంది. వింతగా చూసింది విమల.

"ఏవిటి నువ్వనేది? నిజంగానా విమలా? నిజంగానా?"

స్నేహితురాలి భుజమ్మీద చెయ్యివేసింది విమల. ఈ వార్తకి ఆమెలో అంత మార్పు వస్తుందని ఊహించలేకపోయింది.

శ్రీనాథ్‌ని తల్చుకుని క్రిష్ణవేణి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

రెక్కలు కట్టుకుని అతని ముందు వాలిపోవాలనిపించింది.

కన్నతల్లిని కోల్పోయి ఒంటరి అయిన అతన్ని ఓదార్చాలనిపించింది.

పంతాలూ పట్టుదలలూ అహంకారపు ప్రవర్తనలూ పిచ్చి ఆవేశాలూ అన్నీ కలిపి అవతలకి విసిరేసి స్నేహపూర్వక పరామర్శకి చోటివ్వాలనిపించింది.

రేపు ఆఫీసులో ఇన్‌స్పెక్షన్, సెలవు దొరకదు. ఇంక ఎల్లుండే. అతని అడ్రస్ తన దగ్గరుంది. మర్చిపోకుండా రేపు అతనికి మెసేజ్ ఇవ్వాలి. ఫోన్ చేస్తే పలుకడుగా మరి!

✧ ✧ ✧

తలుపుతీసిన అతన్ని చూస్తూనే ఒక్కసారిగా గుండె కొట్టుకోవడం ఆగిపోయినట్లయింది క్రిష్ణవేణికి. ఇలా అయిపోయాడేమిటి? అన్నం ముట్టనివాడిలా... అంతుపట్టని అనారోగ్యమేదో బాధిస్తున్నవాడిలా. ఆమెని చూసిన శ్రీనాథ్ పరిస్థితీ అలాగే వుంది. ఇంత చిక్కిపోయిందేమిటి?

ముఖంలో కళ కళ లేవీ? ఎప్పుడూ తళుకుల్నే విరజిమ్మిన ఆ కన్నులు వెల వెల బోతున్నా యేమిటి?

మాట రాలేదు నోట్లోంచి కూర్చోమని కుర్చీ చూపించాడు చేత్తోటి. మంచినీళ్ళు తెచ్చి అందించాడు. కిటికీ దగ్గర గోడ కానుకుని మాటలు కూడదీసుకుంటున్న వాడిలా... హఠాత్తుగా అమ్మకొచ్చిన అనారోగ్యం... అంతే హఠాత్తుగా ఆమె ప్రాణం గాలిలో కలవటం... వివరంగా ఆగి ఆగి చెప్తున్న అతని కళ్ళల్లో తడి... వింటున్న ఆమె కన్నులతో పాటూ మనసూ చెమర్చింది.

కాఫీ కలిపే ప్రయత్నం అతను చెయ్యబోతుంటే మృదువుగా వారించింది వద్దని.

చూపులు కలుస్తున్నాయిగానీ మాటకి ప్రాణం పొయ్యలేక అవి బిక్కపోతున్నాయి.

పెదవి దాటి పైకి రాని... ఆర్ద్రత నిండిన అక్షరాలు ఇద్దరి మనసుల్లోనూ అలజడి నింపుతూనే ఉన్నాయి.

"నీకు తప్ప మరొకరికి నా మనసులో స్థానం ఇవ్వడం ఇష్టంలేదు" ఆమె మనోఫలకంపై చెక్కుకున్న మాటలవి.

"నిన్ను మర్చిపోవడం నాకు సాధ్యం కాదు. వేరొకరిని పెళ్ళాడే తలంపే లేదు. కానీ ఇప్పుడు... ఇన్నాళ్ళ తర్వాత... ఈ సందర్భంలో... ఈ మాట వెలిబుచ్చటం ఎంత అవివేకమో నాకు తెలుసు" ఒకప్పుడు తాను చేసిన పొరపాటును ఆలస్యంగా అర్థం చేసుకున్న అతని హృదయ వేదన అది. ఎంతోసేపలా కూచుండిపోయారు. ఇద్దరి మధ్యా మౌనప్రవాహం. తప్పదన్నట్టుగా ఆమె లేచింది వెళ్ళిపోవడానికి. అతను బేలగా చూశాడు. తట్టుకోవడం కష్టమైంది ఆమెకి. గుమ్మం దగ్గరికి నడిచింది. ఒక్క అడుగు వేస్తే తాను అవతల... అతను ఇవతల. వెనక్కి తిరిగి చూసింది అప్పుడు. అప్రయత్నంగా సాగాయి ఇద్దరి చేతులూ ముందుకి... ఒకరి చేతిలో మరొకరి చేయి... పెనవేసుకున్న చూపుల పడవలో మౌనప్రవాహాన్ని దాటి తీరాన్ని చేరుకున్నారు మాటల కలబోతతో.

*ఆంధ్రభూమి వారపత్రిక, 8 ఏప్రిల్ 2010*